సాక్షి
తిరుపతి
I
శనివారం ၊ 20 ၊ సెప్టెంబర్ ၊ 2025



పవిత్రోత్సవం.. పరిసమాప్తం
అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు శుక్రవారం పవిత్ర విసర్జనతో పరిసమాప్తమయ్యాయి. - IIలో



ఎర్ర చందనం స్వాధీనం
అన్నమయ్య జిల్లా రాజంపేట అటవీ ప్రాంతంలో ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకుని స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. - IIలో



పంట కోత ప్రయోగాలపై శిక్షణ
ఖరీఫ్ పంట కోతకు సంబంధించిన ప్రయోగాలపై శుక్రవారం కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. - IIలో

న్యూస్‌రీల్

కిడ్నీ వ్యాధిగ్రస్తులను గుర్తించాలి


కిడ్నీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

దొరవారిసత్రం : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి బాలకృష్ణానాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం పొళెంపాడు గ్రామాన్ని సందర్శించి కిడ్నీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పొళెంపాడులో ఇప్పటి వరకు 23 మంది కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వీరిలో ఇద్దరు మాత్రమే డయాలసిస్ చేసుకుంటున్నారని పేర్కొన్నారు. గ్రామంలో నీటి సరఫరా ఏ విధంగా ఉందని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. మరోమారు గ్రామంలో ఇంటింటికీ వైద్య పరీక్షలు చేసి కిడ్నీ వ్యాధిగ్రస్తులను గుర్తించి తగు చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు ఆదేశించారు. ఆయన వెంట ఎపిడెమియాలజిస్ట్ లావణ్య, వైద్యాధికారి చైతన్య, సిబ్బంది ఉన్నారు.

మైక్రోబయాలజీ ప్రొఫెసర్‌కు పురస్కారం


అవార్డును స్వీకరిస్తున్న ప్రొఫెసర్ చండీ ఎం కుమారి


తిరుపతి రూరల్ : శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని మైక్రోబయాలజీ ప్రొఫెసర్ చండి ఎం కుమారికి జమ్ములోని 'షేర్–ఎ–కాశ్మీర్ వ్యవసాయ శాస్త్ర సాంకేతిక విశ్వవిద్యాలయం'లో 10వ ఆసియా పీజీపీఆర్ అంతర్జాతీయ సమావేశంలో మహిళా శాస్త్రవేత్త అవార్డు లభించింది. 'సూక్ష్మజీవుల సాంకేతికత, స్థిరమైన పర్యావరణానికి సూక్ష్మజీవుల వాడకం'పై ఆమె చేసిన పరిశోధనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. అలాగే 'అబియోటిక్ ఒత్తిళ్లకు వ్యతిరేకంగా పంట స్థితిస్థాపకతను మెరుగుపరచడానికి అవసరమైన వ్యూహాలను అభివృద్ధి చేయడం' అనే అంశంపై మాట్లాడిన ఆమె మొదటి బహుమతి అందుకున్నారు.

క్రషర్ ఏర్పాటుపై నిరసన


తహసీల్దార్ రోశయ్యకు వినతిపత్రాన్ని అందిస్తున్న బ్రాహ్మణపల్లి వాసులు

కేవీబీపురం : బ్రాహ్మణపల్లి గ్రామంలో క్రషర్ ఏర్పాటును నిరసిస్తూ కేవీబీపురం తహసీల్దార్ రోశయ్యకు గ్రామస్తులు వినతిపత్రాన్ని అందించారు. ఇప్పటికే ఉన్న క్రషర్‌తో తిప్పలు పడుతుంటే, అధికారులు మరో క్రషర్ ఏర్పాటుకు అనుమతి ఎలా ఇస్తారని బ్రాహ్మణపల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఇప్పటికే పెరిందేశం రెవెన్యూలో ఉన్న క్వారీ , క్రషర్ బ్రాహ్మణపల్లి గ్రామానికి అతి సమీపంలో ఉన్నందున ఇప్పటికే నానా తిప్పలు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. క్రషర్, క్వారీతో చెరువులు, పంట పొలాలు, తాగు నీరు కలుషితమై మూగజీవాలు అంతు చిక్కని వ్యాధితో మృత్యువాత పడుతున్నాయని వాపోయారు. ఇప్పుడు తమ గ్రామంలో మరో క్రషర్ ఏర్పాటుకు తమిళనాడు వాసులు పావులు కదపడం, అధికారులు అందుకు వత్తాసు పలకడం సరికాదన్నారు. గ్రామస్తుల విన్నపాన్ని కాదని క్రషర్‌కు అనుమతి ఇస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

యూరియా వినియోగం తగ్గించాలి


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : నానో ఎరువులు వాడటం వలన ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చనే విషయాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కోరమండల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నానో ఎరువుల ప్రాముఖ్యం, వాడకంపై మండల ఏవోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏర్పడుతున్న యూరియా కొరతను అధిగమించడానికి యూరియా వినియోగం తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై రైతుల్లో అవగాహన పెంపొందించాలన్నారు. కోరమండల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ బిజినెస్ మేనేజర్ స్వరూప్ మాట్లాడుతూ.. నానో ఎరువుల తయారీ, వివిధ పంటల్లో దశల వారీగా వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. డీఏవో కార్యాలయ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, సీనియర్ అగ్రోనమిస్ట్ సేల్స్ ఆఫీసర్ మురళీ పాల్గొన్నారు.

'మెడికల్ కోర్సు చదవాలన్న పేదల కలలపై చంద్రబాబు ఉక్కుపిడికిలి బిగించారు. రాష్ట్రంలో వైద్యవిద్యను విక్రయానికి ఉంచారు. దీంతో పేదలకు వైద్యవిద్య దూరం.. సామాన్యులకు ఉచిత వైద్యం గగనం అవుతుంది. కూటమి సర్కారు దీన్ని వెంటనే ఆపాలి.' అని వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నేతలు డిమాండ్ చేశారు.

- విక్రయానికి వైద్యవిద్య
- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ యత్నాలు
- చంద్రబాబు రాగానే ప్రైవేటీకరణకు కుట్ర
- ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు జగన్ సర్కారు కృషి
- 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి వైఎస్ జగన్ అడుగులు

అందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగం నేతలు, పార్టీ ప్రముఖులు



మెడికలపై ఉక్కుపిడికిలి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: సీఎం చంద్రబాబు పేద విద్యార్థుల వైద్యవిద్య కలపై ఉక్కుపిడికిలి బిగిస్తున్నారని, దేశంలోని మెడికల్ కళాశాలల్లో ఎక్కడా పీపీపీ విధానం లేదని, చంద్రబాబు చెబుతున్న నిధుల కొరత కథ అంతా నాటకమేనని వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నేతలు ధ్వజమెత్తారు. మదనపల్లె ప్రభుత్వ వైద్యకళాశాల ప్రైవేటీకరణను నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో చలో మదనపల్లె మెడికల్ కళాశాల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నేతలు పాల్గొని, మాట్లాడారు. చంద్రబాబు హయాంలో ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేయలేదని, ఒక మెడికల్ సీటు పెంచలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో రాష్ట్రంలో 2,550 మెడికల్ సీట్లు వస్తుండగా వాటిపై కూటమి నేతల దుష్ప్రచారాలు చేస్తున్నారని


నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


సెల్ఫీ తీసుకుంటున్న భూమన అభినయ్, హర్షిత్‌రెడ్డి

అన్నారు. వైద్యకళాశాలల ప్రైవేటీకరణతో పేద, మధ్య తరగతికి విద్యార్థులు వైద్యవిద్యకు దూరం కావడమే కాకుండా, పేదలకు ఉచిత సేవలు దూరం అవుతాయని ఆవేదన చెందారు. వైద్య కళాశాలల పీపీపీ ప్రక్రియను తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

చలో మదనపల్లె మెడికల్ కళాశాల భారీ సక్సెస్

ప్రభుత్వ వైద్యవిద్య పరిరక్షణే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో మదనపల్లె మెడికల్ కళాశాల కార్యక్రమం భారీ సక్సెస్ అయ్యింది. వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిరసన జ్వాలలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు, విద్యార్థి విభాగం, యువజన విభాగం నేతలు మాట్లాడుతూ అ యిన వారికి దోచిపెట్టడమే చంద్రబాబు నైజమని మండిపడ్డారు. పేదింటి బిడ్డలకు వైద్యవిద్య భారం కాకూడదని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వంలో అప్పటి సీ ఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 నూతన వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారని చె ప్పారు. అందులో భాగంగానే అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రూ.470 కోట్లతో 95 ఎకరాల్లో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారని చెప్పారు. కళాశాల భవన నిర్మాణాలు చాలా వరకూ పూర్తి అయ్యాయని తెలిపారు. కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు ఆగిపోయాయని తెలిపారు. ఏడాదిన్నరగా పనులు సాగలేదని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే రాష్ట్రంలో ఐదు మెడికల్ కళాశాలలను ప్రారంభించారన్నారు. ఆ సమయంలోనే ఎన్నికలు రావడం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందన్నారు. పేదల ఆశలపై నీళ్లు చల్లుతూ సీఎం చంద్రబాబు 'పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్షిప్' (పీపీపీ) విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారని చెప్పారు. రాష్ట్రంలో 10 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే చ ర్యలకు ఉపక్రమించారని తెలిపారు. ప్రైవేట్ చేతుల్లోకి మెడికల్ కళాశాలలు వెళితే పేద విద్యార్థులు ఆ వైద్య కళాశాలల గుమ్మం ఎక్కలేని పరిస్థితి తలెత్తనుండడంతోపాటు వైద్యం ఖరీదవుతుందని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్ సీపీ పోరాటాలకు సిద్ధమై, శుక్రవారం యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో మదనపల్లె మెడికల్ కాలేజ్' కా ర్యక్రమం భారీ సక్సెస్ అయ్యిందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ రెడ్డి, మదనపల్లె ఇన్‌చార్జ్ నిస్సార్ అహమ్మద్, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, పుంగనూరు నియోజక వర్గ నేతలు శ్రీనాథరెడ్డి, అనూషరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు భూమన అభినయ్ రెడ్డి, విద్యార్థి విభాగం తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, యువజన విభాగం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ రెడ్డి, అన్నమయ్య జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు జంగంరెడ్డి కిషోర్ దాస్, పార్టీ రాష్ట్ర ప్రచార అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డితోపాటు 17 నియోజకవర్గాల నేతలు పాల్గొన్నారు. అనంతరం మెడికల్ కళాశాల భవనాలను వైఎస్సార్ సీపీ నేతలు పరిశీలించారు.

ప్రధాన భవనం వద్ద బైఠాయింపు

నిర్మాణదశలో ఉన్న ప్రధాన భవనం వద్ద విద్యార్థులు, యువకులతో కలసి వైఎస్సార్ సీపీ నేతలు బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పేదల కలలు– ప్రభుత్వ కళాశాలలు, పేదలకు దూరంగా వైద్యం ..బాబు బినామీలకు నైవేద్యం అని నినాదాలు చేశారు.


భవిష్యత్తును కాలరాస్తున్న కూటమి



రాష్ట్ర ప్రజల భవిష్యత్తును కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.8,500 కోట్లతో 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టగా ఇంకా రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే పనులు పూర్తవుతాయి. ఈ నిధులు ఖర్చు చే యడం భారమని ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పు కుని ప్రైవేటుకు ఇవ్వాలని ప్రజలను మభ్యపెడుతోంది. దీంతో వేల కోట్లను ఆర్జించాలని చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. కళాశాలలు అందుబాటులోకి వస్తే పేద విద్యార్థులు త క్కువ ఖర్చుతో వైద్య విద్యను అభ్యసించే అవకాశం దక్కుతుంది. మదనపల్లె కళాశాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 99 ఎకరాలను కేటాయించింది. ఇక్కడ భవనాలు నిర్మించారు. కొన్ని పూర్తయ్యే దశలో ఉన్నాయి. ఈ వాస్తవాలను ప్రజలను తెలియా లనే నిరసన కార్యక్రమం చేపట్టాం. చంద్రబాబు చర్యలతో రాష్ట్ర భవిష్యత్తు నాశనం అవుతుంది.

– భూమన అభినయ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

జగనన్న కట్టించిన మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాలి



గత ప్రభుత్వంలో జగనన్న కట్టించిన మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని చూస్తోంది. పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువచేయాలని జగనన్న సంకల్పిస్తే, తన వర్గానికి అడ్డగోలుగా కాలేజీలను కట్టబెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పిస్తున్నారు. ఇది నిజంగా పేద విద్యార్థులకు చేస్తున్న తీరని ద్రోహం . ప్రయివేటుపరం చేయబోతున్న మెడికల్ కాలేజీల విషయంలో జరుగుతున్న స్కాంను ప్రజల ముందుకు తీసుకువెళతాం.. ఎట్టి పరిస్థితుల్లోను ప్రైవేటు పరం కాకుండా చూడటానికి పోరాడుతాం. ప్రభుత్వం తమ పోరాటాలను లెక్క చేయకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగనన్న ఆ టెండర్లను రద్దు చేస్తారని ఇప్పటికే ప్రకటించారు. ఆ మెడికల్ కాలేజీల జోలికి ఎవ్వరు రావద్దని హెచ్చరిస్తున్నా.

– చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు



చలో మదనపల్లె మెడికల్ కళాశాల కార్యక్రమానికి తరలివస్తున్న జనం

ప్రైవేటు.. సమ్మె సైరన్!

- ప్రభుత్వంపై ప్రైవేటు డిగ్రీ కళాశాలల కన్నెర్ర
- 22 నుంచి నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చిన సంఘం
- రెండు రోజుల్లోపు ఫీజు బకాయిలు చెల్లించాలని డెడ్‌లైన్
- జిల్లాలో సుమారు రూ.330 కోట్ల బకాయిలు
- ఎస్వీయూ అధికారులకు సమ్మె నోటీసు అందజేత


ఎస్వీయూ అధికారులతో చర్చలు జరుపుతున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ సభ్యులు

జిల్లాలో ప్రైవేటు కళాశాలలు 108	చదువుతున్న విద్యార్థులు 47,360
పెండింగ్‌లో ఉన్నది 6 విడతలు (16 నెలలుగా)	పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు రూ. 330.15 కోట్లు
ఒక్కో కళాశాలకు అందాల్సిన బకాయిలు రూ.3.05కోట్లు	ఒక్కో విద్యార్థికి సరాసరి అందాల్సిన మొత్తం రూ.18 వేలు

తిరుపతి సిటీ : కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. జిల్లాలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు అందాల్సిన సుమారు రూ.330.15 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేస్తోంది. ఇప్పటికే పలు మార్లు ప్రభుత్వం, ఉన్నత విద్యా మండలికి రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో అసోసియేషన్ ప్రభుత్వంపై కన్నెర్ర చేసింది. కళాశాలలను నిరవధికంగా మూసివేయాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు జిల్లాలోని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఎస్వీయూ అధికారులకు సమ్మె నోటీసును అందజేశారు.

22 నుంచి కళాశాలలు నిరవధికంగా మూత

ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు బకాయి నిధులు రెండు రోజుల్లోపు చెల్లించాలంటూ అసోసియేషన్ డెడ్‌లైన్ విధించింది. లేనిపక్షంలో ఈనెల 22 నుంచి జిల్లాలోని అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలను నిరవధికంగా మూసి వేసి బంద్ చేపట్టనున్నట్లు హెచ్చరించాయి. విద్యార్థులు, ఇటు కళాశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం ఆటాడుకుంటోదని అసోసియేషన్ మండిపడింది. కళాశాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు చెల్లించలేక, కళాశాల నిర్వహణ వ్యయాల కోసం అప్పులు చేసి ఇప్పటి వరకు నడిపామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కళాశాలలో సైతం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడం విద్యార్థులకు టీసీలు, మార్కుల జాబితాలు అందించలేని దుస్థితి ఏర్పడిందని, ఇటీవల ఎస్వీయూలోనే ఇలాంటి పరిస్థితి చూశామని వారు వాపోతున్నారు.

అయోమయంలో డిగ్రీ ప్రవేశాలు

జిల్లాలో ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు నిరవధిక సమ్మెలోకి వెళ్తే పరిస్థితి దారుణంగా తయారయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో నాలుగు నెలలుగా చేపట్టిన డిగ్రీ కోర్సుల ప్రవేశాలు ఎట్టకేలకు గురువారం ప్రారంభమయ్యాయి. దీంతో డిగ్రీ తొలి విడత అడ్మిషన్లు ప్రారంభమైన సమయంలో ప్రైవేటు కళాశాలలు సమ్మెలోకి వెళ్లి కళాశాలలను నిరవధికంగా మూసివేస్తే విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారనుంది. గత ఏడాది నుంచి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు అంతంత మాత్రంగా ఉన్నాయి. కనీసం 40 శాతం సైతం పూర్తి స్థాయిలో ప్రవేశాలు జరగకపోవడంతో కళాశాలు వెలవెలబోతున్నాయి. ఈ తరుణంలో ప్రైవేటు కళాశాలలు బంద్‌కు పిలుపునివ్వడంతో డిగ్రీ ప్రవేశాలు 20 శాతం సైతం జరిగే పరిస్థితి లేదని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.


వీసీకి సమ్మె నోటీసు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు

కళాశాలలు నడిపే పరిస్థితి లేదు

ప్రభుత్వం 16 నెలలుగా ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు బకాయిలు (ఆర్టీఎఫ్ నిధులు) కనీసం ఒక పైసా చెల్లించలేదు. జిల్లాలో ఒక్కో ప్రైవేటు కళాశాలకు సుమారు రూ. 3.05 కోట్లు ఫీజు బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. దీంతో పలుమార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నాం. అయినా స్పందించలేదు. సోమవారం నుంచి కళాశాలలను మూసివేయాలని రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాల అసోసియేషన్ పిలుపు నిచ్చింది. జిల్లాలోని అన్ని ప్రైవేటు కళాశాలలు బంద్ పాటించనున్నట్లు ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుకు సమ్మె నోటీసు అందజేశాం. వర్సిటీలో అధికారులు సమ్మె నోటీసు అందజేస్తే నిర్లక్ష్యంగా మాట్లాడటం బాధాకరం.

– పట్నం సురేంద్రరెడ్డి, ఉపాధ్యక్షుడు, ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్

క్లుప్తంగా

ఎర్ర చందనం స్వాధీనం

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : అన్నమయ్య జిల్లా రాజంపేట అటవీ ప్రాంతంలో 5 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒక స్మగ్లర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ కృపానంద, ఆర్ఎస్ఐ అల్లి బాష టీమ్ రాజంపేట రోళ్లమడుగు ఫారెస్ట్ బీట్ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. శుక్రవారం ఉదయం పుట్టంగి మడుగు ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు తరలిస్తూ కనిపించారు. దీంతో టాస్క్‌ఫోర్స్ టీమ్ వారిని చుట్టుముట్టే ప్రయత్నించగా వారు తప్పించుకున్నారు. వారిని వెంబడించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఒకరిని పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తి తమిళనాడు రాష్ట్రంగా గుర్తించారు. దుంగలతో పాటు అతడిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించగా డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాస్ విచారించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీకి రూ.10 లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

తిరుమల: హైదరాబాద్‌కు చెందిన ఆదిత్య పోలేపల్లి అనే భక్తుడు టీటీడీ శ్రీ బాలాజీ ఆరోగ్య వర ప్రసాదిని(స్విమ్స్) పథకానికి రూ.10,11,116 విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

పొలం దున్నుతుండగా ట్రాక్టర్ బోల్తా - డ్రైవర్ మృతి



బోల్తా పడ్డ ట్రాక్టర్



బత్తయ్య మృతదేహం

తొట్టంబేడు : మండలంలోని పూడి గ్రామంలో ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు గ్రామంలోని కొత్త హరిజనవాడకు చెందిన బత్తయ్య అనే వ్యవసాయ కూలీ (డ్రైవర్) ఓ రైతు వద్ద కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం స్వర్ణముఖి నది సమీపంలో తాళ్లూరు పంట పొలాల్లో ట్రాక్టర్ దున్నుతుండగా అడుసులో దిగబడి పోయింది. ట్రాక్టర్‌ను బయటకు తీసే క్రమంలో తిరగబడింది. దీంతో డ్రైవర్ అక్కడికక్కడే బురదలో కూరుకుపోయి మృతి చెందాడు.

ప్రశ్నించే పత్రికలపై అక్రమ కేసులు



కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, ప్రజావ్యతిరేక కార్యకలాపాలను ప్రశ్నించి ప్రచురించిన పత్రికలపై అక్రమ కేసులు బనాయించడం ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తే కక్ష సాధింపు చర్యలకు దిగడం పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించినట్లే. వ్యవస్థలను ప్రభుత్వం చేతుల్లోకి తీసుకుని సాక్షి ఎడిటర్, విలేకర్లతో పాటు పలు టీవీ ఛానళ్లపై కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లే.

– బండి చలపతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, తిరుపతి



ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు



ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పత్రికా రంగంపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల దృష్టి తీసుకొచ్చేది మీడియా మాత్రమే. అలాంటి మీడియాపైన అక్రమ కేసులు బనాయించి బెదిరింపులకు దిగడం దారుణం. సాక్షి ఎడిటర్, పత్రికా విలేకరులపై పెట్టిన కేసులు తక్షణం ఉపసంహరించుకోవాలి. పత్రికా స్వేచ్ఛను హరించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలి.

– భగత్ రవి, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ప్రణాళిక

- భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి
- టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్



మాట్లాడుతున్న ఈవో అనిల్ కుమార్ సింఘాల్

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సూక్ష్మ, క్షేత్రస్థాయి ప్రణాళికలు రూపొందించి భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో ఆయన టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, టీటీడీ వివిధ విభాగాధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీఈ సత్యనారాయణ, తిరుమల ఏఎస్పీ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం టీటీడీ ఈవో మీడియాతో మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను వివరించారు.

సమావేశంలోని ముఖ్యాంశాలు

- బ్రహ్మోత్సవాలు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు గరుడసేవ
- ధ్వజారోహణం రోజు (సెప్టెంబర్ 24) రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పణ, 25న పీఏసీ 5 భవనాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు.
- పుష్పాలంకరణకు 60 టన్నుల పుష్పాల వినియోగం
- బ్రహ్మోత్సవ రోజుల్లో సిఫార్సు లేఖల ద్వారా గదుల కేటాయింపులు రద్దు. ఈ సమయంలో 3500 గదులు ఆఫ్‌లైన్‌లో సాధారణ భక్తులకు మాత్రమే కేటాయింపు.
- భక్తులు వాహన సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించేందుకు ఈ ఏడాది 36 ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు.
- 1.16 లక్షల ప్రత్యేక దర్శన టికెట్లు, రోజూ 25 వేల ఈ టోకెన్లు (గరుడ సేవ మినహా) విడుదల. అన్ని ప్రివిలేజ్ దర్శనాలు రద్దు. వీఐపీ బ్రేక్ దర్శనం స్వయంగా విచ్చేసే ప్రొటోకాల్ ప్రముఖులకే పరిమితం.
- తిరుమలలో 24 ప్రాంతాల్లో సుమారు 4000 వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు.
- తిరుపతిలో అలిపిరి లింక్ బస్టాండ్, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్, ఇస్కాన్ గ్రౌండ్, ఎస్వీ మెడికల్ కాలేజ్ గ్రౌండ్, భారతీయ విద్యా భవన్ గ్రౌండ్, దేవలోక్, ఏపీ టూరిజం ఓపెన్ ఏరియాల్లో మొత్తం 5250 ద్విచక్ర వాహనాలకు, 2700 కార్లకు పార్కింగ్ స్థలం కేటాయింపు.
- పార్కింగ్ ప్రదేశాల నుంచి తిరుమలకు ఆర్టీసీ బస్సులు. సాధారణ రోజుల్లో ఆర్టీసీ బస్సుల ద్వారా 1900 ట్రిప్పులు, గరుడసేవ రోజున 3200 ట్రిప్పులు తిరిగేందుకు ఏర్పాట్లు
- గరుడసేవ రోజున 20 రాష్ట్రాల నుంచి వచ్చిన 37 బృందాలు సంప్రదాయ, ఆధ్యాత్మిక కళారూపాల ప్రదర్శన

జేశాప్ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవం



ఎన్నికైన తిరుపతి జిల్లా జేశాప్ కమిటీ, జిల్లా క్రీడాకారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోనే ఏకైక జర్నలిస్టు క్రీడా సంఘంగా గుర్తింపు పొందిన జేశాప్ (జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ఉమ్మడి తిరుపతి, చిత్తూరు జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. జేశాప్ రాష్ట్ర అధ్యక్షుడు రత్నాకర్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ నరేష్ ఆదేశాల మేరకు శుక్రవారం తిరుపతి కరకంబాడి రోడ్డులోని సీవీ క్రికెట్ అకాడమీలో జిల్లాస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేశాప్ గత జిల్లా కమిటీ అధ్యక్షుడు పులుగూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు సమక్షంలో పలు తీర్మానాలు చేశారు. ఇందులో భాగంగానే నూతన జిల్లా కమిటీని వారు ప్రకటించారు. జేశాప్ తిరుపతి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా విజయ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా నారా హరిబాబు, కోశాధికారిగా భూమిరెడ్డి నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు ఉపాధ్యక్షులుగా పి.సుబ్రహ్మణ్యం, దుగ్గాని ప్రసాద్, నెల్లూరు శ్రీనివాసులు, ఉప కార్యదర్శులుగా కామేశ్వరయ్య, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, సీనయ్య ఎన్నిక కాగా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నాగార్జున, ప్రతాప్ కుమార్, చిన్నబాబు, మునిశేఖర్, అమర్నాథ్, విజయ్ కుమార్, మునికృష్ణారెడ్డి, భాస్కర్, లోకేష్ రాజు, సతీష్ కుమార్, తులసి రామ్, జగదీష్, మనోహర్ ఏకగ్రీవంగా ఎన్నికయిన వారిలో ఉన్నారు.

జర్నలిస్టులకు క్రీడలు అవసరం

జర్నలిస్టులకు క్రీడలు ఎంతో అవసరమని, జర్నలిస్టులు రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో రాణించాలని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నాకర్, విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. అక్టోబర్ నెల 5, 6, 7, 8 తేదీల్లో అనంతపురం ఆర్‌డీటీ స్టేడియం వేదికగా పోటీలు జరగనున్నాయి.

చిన్నారిపై అమానుషం

- తొమ్మిదేళ్ల బాలికతో అసభ్య ప్రవర్తన
- చితకబాదిన స్థానికులు.. రంగంలోకి పోలీసులు

పాకాల : ఆడుతూ పాడుతూ తిరుగుతున్న ఓ చిన్నారిపై ఓ వ్యక్తి కర్కశంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు పాకాల మండలంలో దామలచెరువుకు సమీపంలోని ఓ కాలనీలో గురువారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో నాలుగో తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు తమ కాలనీలోని వినాయకస్వామి ఆలయం ముందు ఆడుకుంటున్నారు. అదే సమయంలో తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఓ మానవ మృగం ఇద్దరు చిన్నారులను ఇంటికి తీసుకెళ్తానని నమ్మబలికి తన ఆటోలో ఎక్కించుకున్నాడు. పక్క వీధిలో ఒక బాలిక తాను ఇక్కడే దిగుతానని దిగేయడంతో మరో బాలికను కాలనీకి సమీపంలోని నిర్మానుషంగా ఉండే ప్రాంతానికి తీసుకొచ్చి బాలిక శరీరంపై తాకుతూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఏం జరుగుతోందో తెలియని బాలిక తేరుకుని ఒక్కసారిగా అక్కడి నుంచి పారిపోయి ఇంటికి పరుగున వచ్చేసింది. కొంత సేపటికి ఆ బాలిక భయంతో తీవ్ర జ్వరానికి లోనయింది. జ్వరంతో ఉన్న కుమార్తెను ఏమి జరిగిందని తల్లి ప్రశ్నించగా భయపడుతూ తనకు జరిగిన సంఘటనను వివరించింది. విషయం తెలుసుకుని ఆగ్రహించిన తల్లి చుట్టు పక్కల వారితో తన కుమార్తెకు జరిగిన అన్యాయాన్ని వివరించింది. ఆగ్రహించిన స్థానికులు నిందితుడిని చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం బాధితురాలు తల్లి పాకాల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

17 వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

- మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో నెలకొల్పిన 17 ప్రభుత్వం వైద్య కళాశాలను పీపీపీ విధానంతో ప్రవేటీకరణకు చేసే నిర్ణయాన్ని విస్మరించి ప్రభుత్వమే ఈ కళాశాలలను నిర్వహించాలని మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రవేటీకరణ చేసే నిర్ణయం రాష్ట్రంలోని అనేకమంది పేద ప్రజలకు అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. అనేక సంక్షేమ పథకాలతో ప్రజల హృదయాలను గెలుచుకున్న మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరెడ్డి అని, ఆయన తనయుడు తన అడుగుజాడల్లో పేద ప్రజలకు మేలు చేసే సంకల్పంతో రాష్ట్రంలో అనేక జిల్లాల్లో ఈ వైద్య కళాశాలలు నెలకొల్పారని తెలిపారు. నాడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్‌టీఆర్ కూడా ప్రవేట్ సిద్ధార్థ కళాశాలను ప్రభుత్వ కళాశాలగా మార్చిన సందర్భం ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 కళాశాలలకు శంకుస్థాపన చేసి వాటిని అన్ని వసతులతో నిర్మించడం జరిగిందని, అయితే ప్రస్తుతం టీడీపీ నేతలు కేవలం ఐదు కళాశాలలు ప్రారంభించారని పేర్కొనడం శోచనీయమని తెలిపారు. అధికారంలోకి రాగానే తెలుగుదేశం ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్లు వద్దని కేంద్రానికి లేఖ రాసి అనేకమంది పేద విద్యార్థుల పొట్టకొట్టడం అన్యాయమని తెలిపారు.

పిడుగు పాటుకు వ్యవసాయ కార్మికుడు మృతి



అద్దూరు శివయ్య (ఫైల్)

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండలంలో శుక్రవారం సాయంత్రం పిడుగుపాటుకు ఓ వ్యవసాయ కార్మికుడు మృతి చెందాడు. కల్లిపేడు పంచాయతీ పరిధిలోని గంగమ్మ కట్ట ప్రాంతానికి చెందిన అద్దూరు శివయ్య(22) శుక్రవారం సాయంత్రం గ్రామం సమీపంలో పొలం వద్ద పనులు చేసుకుంటుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో శివయ్య పొలం సమీపంలో చెట్టుకిందకు వెళ్లాడు. ఆ సమయంలో అతనిపై పిడుగు పడడంతో కుప్పకూలిపోయాడు. గ్రామస్తులు గుర్తించి వైద్యశాలకు తరలించారు. అప్పటికే శివయ్య మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెల్లడించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ రాజేంద్ర సంఘటన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని రెవెన్యూ అధికారులు మృతుని కుటుంబ సభ్యులకు సూచించారు.

పవిత్రోత్సవం.. పరిసమాప్తం

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు శుక్రవారం పవిత్ర విసర్జనతో వైభవంగా పరిసమాప్తమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారు జామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, అర్చన చేశారు. అనంతరం ఆలయ పండిత బృందం యాగశాలలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకించారు. సాయంత్రం ఉభయ దేవేరులతో స్వామి వారిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు. అనంతరం మేళతాళాల నడుమ తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అడుగడుగునా నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించారు. పవిత్రోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షించారు.

ఎర్ర చందనం స్మగ్లర్లకు మూడేళ్ల జైలు

బుచ్చినాయుడు కండ్రిగ: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఏడుగురు స్మగ్లర్లకు మూడేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున రూ.లక్ష 40 వేలు జరిమానా విధిస్తూ తిరుపతిలోని రెడ్‌శాండిల్ కోర్టు ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు. 2016వ సంవత్సరంలో మండలంలోని కారణిమిట్ట గ్రామానికి చెందిన సమ్మిటి పెద్దగురవయ్య, కారణి రామయ్య, పిగిలి మోహన్, పిగిలి వెంకటయ్య, చెరివి శ్రీనాథ్, చెరివి రమణయ్య, వెంకటగిరి మునిరత్నం ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తుండగా అప్పటి ఎస్ఐ హేమంత్‌కుమార్‌రెడ్డి వీరిని అరెస్టు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్ష పడేలా చేశారు. ఈ కేసులో సహకరించిన శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడులను తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : ఖరీఫ్ పంటల కోతకు సంబంధించిన ప్రయోగాలపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు, ముఖ్య ప్రణాళికాధికారి వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ నిపుణులు మాట్లాడుతూ.. పంట కోత ప్రయోగాలపై అవగాహన ఉన్నపుడే రైతులకు అవసరమైన పద్ధతుల మేరకు సూచనలు అందించవచ్చన్నారు. ఈ సందర్భంగా పంట కోత ప్రయోగానికి సంబంధించి మండల వ్యవసాయాధికారుల పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల ఏఎస్‌వోలు పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో నమోదు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని ఓ బాలికపై లైంగికదాడి నేపథ్యంలో నాగరాజుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. వైఎస్సార్ కడపకు చెందిన నాగరాజు.. వెంకటగిరిలోని తమ బంధువుల ఇంటికి అప్పుడప్పుడూ వచ్చిపోతుంటాడన్నారు. ఈ క్రమంలో సమీపంలో ప్రాంతంలోని ఓ బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో నాగరాజుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నూతన పీఏసీ-5 భవనంలో టీటీడీ ఈవో తనిఖీలు



తనిఖీ నిర్వహిస్తున్న ఈవో అనిల్ కుమార్ సింఘాల్

తిరుమల: తిరుమలలో నూతనంగా నిర్మించి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీఏసీ-5 భవనంలో శుక్రవారం టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భవనంలోని హాళ్లు, అన్న ప్రసాద వితరణ హాలు, కల్యాణకట్ట, మరుగుదొడ్లు, తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సెప్టెంబర్ 25వ తేదీన పీఏసీ-5 భవనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తుండడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా భవనంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యంత్రాన్ని పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఈవో వెంట సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బారాయుడు, సీఈ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీటీడీకి మొబైల్ ఫాస్ట్ ఫుడ్ వాహనం విరాళం



టీటీడీకి వాహనాన్ని విరాళంగా అందజేస్తున్న దాతలు

తిరుమల: బెంగళూరులోని ఎంఎస్ రామయ్య విద్యా సంస్థలకు చెందిన ఎంఎస్ సుందర్ రామ్ అనే భక్తుడు శుక్రవారం తిరుమల శ్రీవారికి అన్న ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేసేందుకు రూ.14 లక్షల విలువైన అశోక్ లేల్యాండ్ కంపెనీకి చెందిన బడా దోస్త్ మొబైల్ ఫాస్ట్ ఫుడ్ వాహనాన్ని విరాళంగా అందించారు. దీంతో పాటు టీటీడీ వేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు రూ.10లక్షలు విరాళం అందించారు. ఈమేరకు దాత శ్రీవారి ఆలయం ముందు టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి వాహనం తాళాలు, డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లోకనాథం, డీఈ వెంకటాద్రి నాయుడు పాల్గొన్నారు.

పోకిరీల వెకిలి చేష్టలు

తిరుపతి క్రైమ్ : తిరుపతి నగరంలో మద్యం మత్తులో పోకిరీలు హల్చల్ చేశారు. లీలామహల్ జంక్షన్ సమీపంలోని అమెరికన్ బార్ వద్ద ఆరుగురు యువకులు రాత్రి బీభత్సం సృష్టించారు. రోడ్డుపై వెళ్తున్న తల్లి, కూతురిని వేధించగా ఆగ్రహించిన స్థానికులు వారిలో ముగ్గురిని పట్టుకొని చితకబాదారు. మరో ముగ్గురు అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం పట్టుబడ్డ యువకులను స్థానికులు పోలీసులకు అప్పగించగా ముగ్గురిని అలిపిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనతో మంగళం రోడ్డుపై కొంతసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

కరకంబాడి రోడ్డులో ఘర్షణ

మద్యం మత్తులో హల్‌చల్ చేసిన గ్యాంగే ముందుగా కరకంబాడి రోడ్డులోని ఓ వైన్ షాప్ వద్ద పీకల్లోతు మద్యం తాగి అక్కడి వారితో ఘర్షణకు దిగారు. వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారిపై కూడా దాడికి పాల్పడ్డారు. అక్కడి నుంచి బయలుదేరిన వారు నేరుగా అమెరికన్ బార్ వద్దకు వెళ్లి మహిళలపై అసభ్యకర ప్రవర్తనకు పాల్పడటంతో పరిస్థితి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు యువకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసులు వేగంగా స్పందించి కేవలం 12 గంటల్లోనే ముగ్గురు యువకులు చందు, హరి, శివను అరెస్టు చేసి వివిధ సెక్షన్ల కింద అలిపిరి పోలీసులు కేసులు నమోదు చేశారు.

లోకాయుక్త చేరిన నిధుల గోల్‌మాల్

- చిగురువాడ 'పంచాయతీ' నిధుల దుర్వినియోగంపై కేసు
- నవంబరు 19లోపు అభ్యంతరాలకు అవకాశం


NOTICE
BEFORE THE HONBLE LOKAYUKTA OF ANDHRA PRADESH

లోకాయుక్త నుంచి ఫిర్యాదు దారుడు కిరణ్‌కుమార్‌రెడ్డికి చేరిన నోటీసు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీలో చోటు చేసుకున్న నిధుల గోల్‌మాల్ వ్యవహారం లోకాయుక్తకు చేరింది. గ్రామ పంచాయతీ నిధులను సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్ కుమార్‌రెడ్డి పక్కదారి పట్టించారని, అదే గ్రామ పంచాయతీలో 9వ వార్డు సభ్యులుగా ఉన్న ముచ్చేలి కిరణ్‌కుమార్‌రెడ్డి లోకాయుక్తను ఆశ్రయించారు. ఆ కేసులో పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగినప్పటికీ అందుకు సంబంధించిన బాధ్యులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోలేదని ఫిర్యాదు దారు పేర్కొన్నారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారికి లోకాయుక్త నుంచి నోటీసులు చేరాయి. అందుకు సమాధానంగా జిల్లా పంచాయతీ అధికారి నుంచి చిగురువాడలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు అందరికీ ఇప్పటికే షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగిందని, అలాగే పంచాయతీ సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ దేవికి షోకాజ్ నోటీసు పంపించినా వారి నుంచి ఎలాంటి సంజాయిషీ తమకు రానందున మరోసారి నోటీసును జారీ చేశామన్నారు. షోకాజ్ నోటీసులకు వారి నుంచి సమాధానం వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని లోకాయుక్తకు నివేదించారు. జిల్లా పంచాయతీ అధికారి నుంచి లోకాయుక్తకు చేరిన నివేదికను జతపరుస్తూ ఆ నివేదికపై ఏదైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే నవంబరు 19 లోపు చెప్పుకోవాలని లోకాయుక్త ఉత్తర్వులు జారీ చేసింది. ఇంత కాలం పంచాయతీకి పరిమితమైన నిధుల గోల్‌మాల్ రగడ లోకాయుక్తకు చేరడంతో మండలంలో ప్రధానంగా చర్చనీయాంశమైంది.

ఈ-సేవ ఉద్యోగుల నిరసన



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి

తిరుపతి కల్చరల్ : తొలగించిన 607 మంది ఈ-సేవ ఉద్యోగులను మంత్రి లోకేష్ హామీ మేరకు తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని సంఘం నేతలు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆరు జిల్లాలకు చెందిన ఈ సేవ ఉద్యోగులు పాత మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం అభ్యర్థన దీక్ష పేరుతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి మాట్లాడుతూ... యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేష్ తొలగించిన ఈ సేవ ఉద్యోగులను తీసుకుంటామని, వారికి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఈ సేవ ఉద్యోగుల గురించి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనేక సార్లు విజ్ఞప్తులు చేసినా స్పందన లేదన్నారు. ఏపీ మీ సేవా కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు నడపడానికి, ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలు వసూలు చేయడంలోనూ కీలక పాత్ర వహిస్తున్నామని తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి వెంటనే ప్రభుత్వం చొరవ చూపాలని, ఈ సేవ ఉద్యోగులకు పని భారం తగ్గించడానికి, తొలగించిన కార్మికులను పనుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యాశాఖ అధికారులపై హైకోర్టులో పిటిషన్



హైకోర్టు న్యాయవాదుల ద్వారా పిటిషన్ దాఖలు చేస్తున్న ఇరుగ్రామాల పెద్దలు

కేవీబీపురం: పాఠశాలల విలీన ప్రక్రియను తమ జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు నిబంధనలకు వ్యతిరేకంగా చేశారని, ఇందుకు తమ సంతకాలను సైతం ఫోర్జరీ చేశారని ఆరోపిస్తూ కేవీబీపురం మండలంలోని గురుకులకండ్రిగ, ఏపీ పురం గ్రామస్తులు శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విలీన ప్రక్రియను విద్యాశాఖ అధికారులు నాయకుల పోద్బలంతోనే చేశారని మండిపడ్డారు. వారికి అనుగుణంగా మ్యాపింగులు చేశారని, తమకు సమాచారం గాని, తమ ఆమోదంకాని లేకుండా, సంతకాలను స్థానిక అధికారులే ఫోర్జరీ చేసి తమ పిల్లలు మూడు నెలలుగా బడులకు దూరం కావడానికి కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ కమిషనర్‌ను కలిసి మొరపెట్టుకోగా స్పందించిన ఆయన పాఠశాలలను అక్కడే నడపాలని ఆదేశించినా అధికారులు మాత్రం విషయాన్ని తప్పుదోవ పట్టిస్తూ, తమపై కక్ష పూరితంగా వ్యవహరించారన్నారు. ఇందుకు గాను జిల్లా విద్యాశాఖ, మండల ఎంఈఓతో పాటు, మరో ఇద్దరు స్థానిక ఉద్యోగులపై పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. తమ సంతకాలను ఫోర్జరీ చేసిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతులను సమర్పించారు.